

సమగ్ర శిక్షలో పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఆసక్తి గలిగిన స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జిటిల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమగ్ర శిక్ష ఎపిడి ఎస్.సుభాషిణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకడమిక్ మానిటరింగ్ అధికారి, ఎంఐఎస్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ పోస్టులకు దరఖాస్తులను ఈ నెల 20 సాయంత్రం 05.00 గంటల్లోపు చేరునట్లు పంపాలని తెలిపారు. నోటిఫికేషన్, దరఖాస్తు నమూనా, నియామవళి కోసం సంబంధిత ఎంఇఓ, డిఇఓ, సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయాల్లో లేదా http://www.ssrjy.org వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. అదనపు వివరాలకు 9866779398లో సంప్రదించాలని సూచించారు.

రబీ సాగు ప్రారంభం..

1,96,480 ఎకరాల్లో వరి సాగు లక్ష్యం
4,828 ఎకరాల్లో నారుమళ్లు
1,15,781 మెట్రిక్ టన్నుల ఎరువులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో రబీ ప్రణాళికను జిల్లా వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. ఈ ఏడాది రబీలో 1,96,480 ఎకరాల్లో వరి సాగు చేయాలని రబీ ప్రణాళికలో వ్యవసాయ శాఖ పేర్కొంది. జిల్లాలో సార్వా వరి సాగులో వరి మాసూళ్ల పర్వం ఇంకా కొనసాగుతుండగానే రబీ వరి సాగుకు రైతులు ఉపక్రమిస్తున్నారు. రబీ సీజన్‌కు సంబంధించి 640 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని జిల్లా వ్యవసాయ శాఖ రబీ ప్రణాళికలో పేర్కొంది. ఏపి సీడ్స్‌తో పాటు సహకార సంఘాల్లో, ఇతర ప్రైవేటు డీలర్ల వద్ద ఈ విత్తనాలు లభ్యమయ్యే అవకాశాలు ఉన్నాయి. మేలు రకమైన విత్తనాలను సాగు చేసే అధిక దిగుబడులు రావడానికి అవకాశాలు ఉంటాయి. వ్యవసాయ అధికారులు సూచించిన మేలు రకమైన వరి వంగడాలను సాగు చేస్తే దిగుబడులు లభించడంతో పాటు రైతులకు ఆర్థికంగా లబ్ధి చేకూరే అవకాశాలు ఉన్నాయి. వాతావరణం అనుకూలించి సాగు సక్రమంగా జరిగినా వరి దిగుబడులు ఆశించిన దాని కంటే పెరిగే అవకాశాలున్నాయి. రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో 1,15,781 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ఇప్పటికే జిల్లాలో 43,902 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ రబీ ప్రణాళికలో పేర్కొంది. ఇందులో ప్రధానంగా డిసెంబరు సంబంధించి జిల్లాకు 19,742 మెట్రిక్ టన్నులు మాత్రమే ఎరువులు అవసరం అవుతాయని ఆ ప్రణాళికలో పేర్కొన్నారు. అంతకన్నా ఎక్కువగానే ఎరువుల నిల్వలు జిల్లాలో ఉన్నాయని ఆ ప్రణాళికలో జిల్లా వ్యవసాయ శాఖ పేర్కొంది. ఇందులో ప్రధానంగా యూరియా 16,000 మెట్రిక్ టన్నులతో పాటు ఇతర డిఎపి, ఎస్ఓపి, ఎంఒపి, ఎస్ఎస్‌పి ఎరువులను సిద్ధంగా ఉంచారు. రబీ సీజన్‌లో ఈ ఎరువులను రైతులు వినియోగించుకోవచ్చు. రాజానగరం, దేవరపల్లి, నల్లజర్ల, కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాల్లో వరి నాట్లు సైతం ప్రారంభించారు. ఈ నెలాఖరు నాటికి నాట్లు ఊపందుకోనున్నాయి. ఈ ఏడాది ప్రకృతి విపత్తుల ఫలితంగా ఖరీఫ్ దిగుబడులు ఆశాజనకంగా లేక రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాజా పంటకు పెట్టుబడులకు సతమతం అవుతున్నారు. తాజా పంటలో అధిక దిగుబడులు వచ్చే వంగడాలపై మొగ్గు చూపిస్తున్నారు. ముఖ్యంగా 120 రోజుల పంట కాలపరిమితి వంగడాలైన ఎంటియూ-1121, ఆర్ఎన్ఆర్-15048, ఎంటియూ-1121, ఆర్ఎస్ఆర్-15048, ఎంటియూ-1156, ఎంటియూ-1153 రకాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. కొంతమంది రైతులు డిసిఎంఎస్ సొసైటీల నుంచి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. మరి కొంతమంది రైతులు సొంతంగా తయారు చేసుకున్న విత్తనాలను సాగు చేస్తున్నారు.



93 శాతం వరి మాసూళ్లు పూర్తి

జిల్లాలో ఈ ఏడాది సార్వా సీజన్‌లో 1,76,000 ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి మాసూళ్ల పర్వం కొనసాగుతోంది. ఇప్పటివరకు 93 శాతం వరి మాసూళ్లు పూర్తయ్యాయి. గోకవరం, కోరుకొండ, సీతానగరం, తాళ్లపూడి, పెరవలి మండలాల్లోనూ పూర్తయితే 100 శాతం పూర్తవుతుంది. మెట్ట ప్రాంతాల్లో రబీ వరి నారుమళ్లు ప్రారంభం అయ్యాయి.

- ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి.



ధర్నా చేస్తున్న సహకార ఉద్యోగులు

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం సిటీ

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు సిఐటియు ఆధ్వర్యంలో డిసిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తోట వెంకటరమయ్య, జిల్లా అధ్యక్షుడు కెవిఎ.సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి జి.సుధాకర్ వర్మ, జిల్లా గౌరవాధ్యక్షుడు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ ధర్నాలో మాట్లాడారు. ఏపి ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబర్ 36 ప్రకారం ప్రాథమిక సంఘాల్లో పని చేస్తున్న సిబ్బందికి హెచ్ఆర్ పాలసీ అమలు చెయ్యాలని, పేస్కేల్ నిర్ణయించాలని అన్నారు. దీనిపై దఫదఫాలుగా ఎస్ఎల్‌ఎసి నివేదికలు ఇచ్చినట్లు తెలిపారు. దీనిపై జిల్లా సాధికారిక కమిటీ ఏవిధమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. జిల్లా సహకార ఉద్యోగుల సమస్యలే కాక రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. నగరపాలక సంస్థ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో పబ్లిక్ హెల్త్ అధికారులు, సిబ్బందితో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఉదయం 7 గంటల కల్లా రోడ్లను ఊడ్చి.. చెత్త కుప్పలను ఎత్తివేయాలని కమిషనర్ ఆదేశించారు. రహదారులపై ఎక్కడా చెత్త కనిపించకూడదని, బాధ్యత లేకుండా రోడ్లపై చెత్తను పారవేసే వారితోపాటు దుకాణాల వద్ద డస్ట్ బిన్‌లు పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వ్యాపారులకు జరిమానాలు విధించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తున్న వ్యాపారులకు భారీగా జరిమానాలు విధించాలని ఆదేశించారు. గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల తొలగింపుపై సంతృప్తి వ్యక్తం చేశారు. నెలాఖరులోగా మిగిలిన జివిపిలను తొలగించాలని, అనంతరం నగరంలోని మేజర్ డ్రెయిన్ల క్లీనింగ్ లక్ష్యంగా ముందుకు వెళదామని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్, ఎంహెచ్ఓ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

లంకమాలపల్లి పంచాయతీ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పెరవలి

మండలం ఖండవల్లి పంచాయతీ పరిధిలోని లంకమాలపల్లి హామ్లెట్ ప్రాంతాన్ని ప్రత్యేక పంచాయితీగా ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం తహశీల్దారు కె.నిరంజన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయంలో సేవలు చేస్తున్నప్పటికీ గ్రామంలో మెయిన్ పంచాయతీకి వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు దూరం వెళ్ళవలసి వస్తోందని, లంకమాలపల్లి పరిధిలో ఎర్రవంతెన, మధ్యపేట, చినపేట, పెదపేట ప్రాంతాల్లో 1,600 మంది జనాభా ఉండగా 1,230 వరకూ ఓట్లు నమోదవుతున్నాయి గోదావరి ఏటిగట్టు పక్కన మారుమూలగా ఉండటంతో అభివృద్ధికి దూరంగా ఉందని వారు వాపోయారు. అధికారులు వెంటనే ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులిదిండి నాగరాజు, ఎంపిటిసి బొక్కే వెంకటేశ్వరరావు, కుసుమె సూరిబాబు, నక్కా సత్తిపండు, బీర వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ అందజేత

ప్రజాశక్తి-గోపాలపురం

హెల్పింగ్ హాండ్స్ ద్వారా మరిన్ని సేవలు పేదలకు అందించాలని గోపాల్ మెడికల్ షాప్ ప్రొప్రైటర్ గోపాల్, సూర్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని దొండపూడిలో రూ.లక్ష విలువైన ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులకు అందించారు. వారు మాట్లాడుతూ హెల్పింగ్ హాండ్స్ ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది పేద ప్రజలకు అన్ని విధాల ఆదుకుంటున్నట్టు తెలిపారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచిత వైద్యం మందులు అందజేస్తున్నారని తెలిపారు. హెల్పింగ్ హాండ్స్ అండగా ఉండడం ఆనందదాయకం అన్నారు. పేదలకు మరిన్ని సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.



గోపాల్, సూర్యలక్ష్మిని సత్కరిస్తున్న సభ్యులు

బొడ్డు నియామకంపై హర్షం

ప్రజాశక్తి - సీతానగరం

టిడిపి జిల్లా అధ్యక్షునిగా బొడ్డు వెంకటరమణ చౌదరి నియామకంపై పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు గెడ్డం తిమ్మారావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి, ఆనందోత్సహాల మధ్య బాణసంచా కాల్చారు. వలవల రాజా, కాండ్రు శేఖర్, కాండ్రు కాశీవిశ్వనాథం, సింగవరం సర్పంచ్ సంగన చిన పోశయ్య, గంటా రామకృష్ణ, వడ్లమూరి రామరాజు, పుక్కాల శ్రీను, ఎం.చంద్రమౌళిపాల్గొన్నారు.

కొవ్వూరు జట్టుపై నల్లజర్ల గెలుపు

ప్రజాశక్తి-నల్లజర్ల


ఉపాధ్యాయ క్రికెట్ పోటీల్లో ఫైనల్స్‌లో కొవ్వూరు జట్టుపై నల్లజర్ల జట్టు 42 పరుగుల తేడతో విజయం సాధించినట్లు నల్లజర్ల ఉపాధ్యాయులు అప్పారావు తెలిపారు. బ్యాటింగ్‌లో హాఫ్ సెంచరీ చేసిన మహమ్మద్ తోఫిక్ కెప్టెన్‌గా వ్యవహరించగా చిట్టిబాబు వైస్ కెప్టెన్‌గా వ్యవహరంచారు.

టెట్ పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్ 2025) మంగళవారం ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు తెలిపారు. స్థానిక లూథర్‌గిరిలోని రాజీవ్ గాంధీ గ్రూప్ అఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లోని ఇయాన్ డిజిటల్ జోన్ సెంటర్‌లో మొదటి షిఫ్ట్‌లో 958 మందికి 877 మంది హాజరయ్యారని, 81 మంది గైర్హాజర్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం రెండవ షిఫ్ట్‌లో 308 మందికి 297 మంది హాజరైనట్టు, 11 మంది గైర్హాజరైనట్టు డిఇఒ తెలిపారు.

కార్టూ'నిజం'



ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థుల క్రీడా ప్రతిభకు వేదికగా ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మంగళవారం బొమ్మూరులో ఘనంగా ప్రారంభం అయ్యాయి. రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి బెలూన్లు, పావురాలను ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయని, విద్యార్థులు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండి తమ కుటుంబాలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. క్రీడలు విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీ భావనను పెంపొందించి సమగ్ర వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు. పాల్గొన్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కేవలం ఐటి రంగంపైనే ఆధారపడకుండా ఆటోమొబైల్, సివిల్, ఫార్మా, పర్యాటక, సేవా రంగాలు వంటి అనేక రంగాల్లో ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం కల్పిస్తున్న ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, విదేశీ విద్య కోసం కూడా సహాయ సహకారాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మాతృభాషలో విద్యను అభ్యసించడంతో పాటు ఇంగ్లీష్‌ను అనుసంధాన భాషగా, జర్మన్, ఫ్రెంచ్ వంటి విదేశీ భాషలపై కూడా ప్రావీణ్యం సాధించాలని సూచించారు. విదేశీ ఉన్నత విద్యాలయాల్లో సీట్లు పొందాలంటే చదువుతో పాటు క్రీడలు, సంగీతం, ఇతర రంగాల్లో ప్రతిభకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. మంత్రి లోకేష్ సారథ్యంలో విద్యా వ్యవస్థలో సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. ఈ క్రీడా పోటీలు రెండు రోజుల పాటు కొనసాగనున్నాయి. విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం ఈ నెల 18న నిర్వహించనున్నారు. మూడు జిల్లాల నుండి 25 పాలిటెక్నిక్ కళాశాలలు పాల్గొనగా, 500 మంది బాలురు, 220 మంది బాలికలు వివిధ ఇండోర్, అవుట్‌డోర్ క్రీడా విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు.



బెలూన్లు వదులుతున్న ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి

ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ ఎ.మురళి. స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ కార్యదర్శి జివి.సత్యనారాయణమూర్తి, జివి.రామచంద్ర రావు, నాయకులు మత్సేటి ప్రసాద్, మజ్జి పద్మావతి, పండూరి అప్పారావు, తలారి మూర్తి, నిమ్మలపూడి రామకృష్ణ, భీమరశెట్టి రమేష్ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో బాలకృష్ణ ప్రతిభ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఏషియన్ ఓపెన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2025లో కాంస్య పతకం సాధించిన ఆర్‌జి.బాలకృష్ణను కమిషనర్ రాహుల్ మీనా అభినందించారు. ధవళేశ్వరం గ్రామానికి చెందిన బాలకృష్ణ మున్సిపాలిటీలో సిల్ట్ పనులు చేస్తుంటారు. టర్కీలో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలలో సత్తా చాటాడు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని బాలకృష్ణను కమిషనర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, శానిటరి ఇన్స్‌పెక్టర్ ధనరాజ్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కాలేజీలో ఘనంగా ఎన్‌సిసి డే

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం సిటీ

స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో మంగళవారం ఎన్‌సిసి డేను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సెమిస్టర్ ఎండ్ పరీక్షల కారణంగా ఎన్‌సిసి డేను మంగళవారం నిర్వహించినట్టు తెలిపారు. కళాశాలలో ఎన్‌సిసి క్యాడెట్లు జాతీయ స్థాయిలో నిర్వహించే వివిధ క్యాంపుల్లో పాల్గొనిదేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చారన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర వంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి సేవలందిస్తున్నారని తెలిపారు. కళాశాలలో శాంతిభద్రతల పరిరక్షణల్లోనూ ఎన్‌సిసి క్యాడెట్లు ఒక విధంగా ప్రొటెక్షన్ టీములాగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన ఎపి కానిస్టేబుల్ ఫలితాల్లో కళాశాల నుంచి సుమారు 25 మంది విద్యార్థులు ఎంపిక కాగా, అందులో 80 శాతం ఎన్‌సిసి క్యాడెట్లే ఉన్నారని తెలిపారు. ఎన్‌సిసి లెఫ్టినెంట్ డాక్టర్ ఈసబ్ బాషా షేక్, డాక్టర్ కె.అనూషను ప్రిన్సిపల్ అభినందించారు.

నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- దేవరపల్లి

దేవరపల్లి పంచాయతీ పరిధిలోని యాదవుల రోడ్డులో ఉన్న పంచాయతీ బోరు మోటర్లకు సంబంధించిన విద్యుత్ వైర్లను గుర్తుతెలియని దుండగులు కత్తిరించారు. ఈ ఘటనతో మోటర్లు పనిచేయకపోవడంతో గ్రామంలో తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సరఫరా నిలిచిపోవడంతో గ్రామంలోని పలు కాలనీల ప్రజలు తీవ్రమైన అవస్థలు పడుతున్నారు. తక్షణమే మోటర్లను మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కాలనీవాసులు అధికారులను కోరారు. ఈ సంఘటనపై గ్రామ కార్యదర్శి నెట్ట రవికిషోర్ స్పందిస్తూ, బోరు మోటర్లకు సంబంధించిన మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేసి తాగునీటి సరఫరాను పున్ణప్రారంభిస్తామని తెలిపారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇచ్చి గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

రూ.3 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

బొమ్మూరు పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి మంగళవారం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 2014-19 మధ్య కొన్ని అభివృద్ధి పనులు చేపట్టామని, 2019-24 మధ్యకాలంలో పనులు నిలిచిపోయినా, తిరిగి మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వేగంగా అభివృద్ధి పనులు ప్రారంభించామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మరిన్ని నిధులు సమకూర్చి అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే రూరల్ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద మధురానగర్‌లో రూ.1.50 కోట్లు, నేతాజీ నగర్‌లో రూ.కోటి వ్యయంతో పలు పనులు పూర్తి చేశామని తెలిపారు. ఇప్పుడు మరో రూ.3 కోట్లతో కొత్త పనులు చేపట్టనున్నామని, అందులో మురళీకొండ ప్రాంతానికే రూ.2.5 కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. మొత్తం 11 పనుల ద్వారా రోడ్లు, కాలువలు తదితర మౌలిక వసతుల అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. వెంకటేశ్వర నగర్‌కు రూ.13 లక్షలు, ప్రశాంతి నగర్ చెరువు గట్టుకు రూ.12 లక్షలు, పాత బొమ్మూరు, మధురానగర్ ప్రాంతాల్లో రూ.25 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్మ్‌స్ట్రాంగ్, తహశీల్దార్ శ్రీనివాస్, మత్స్యేటి ప్రసాద్, మజ్జి పద్మావతి, పండూరి అప్పారావు, తలారి మూర్తి, ఎన్.రామకృష్ణ, భీమరశెట్టి రమేష్ పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ గోరంట్ల

ఘనంగా జాతీయ ఇంధన వారోత్సవాలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

జాతీయ ఇంధన వారోత్సవాల సందర్భంగా మంగళవారం విద్యుత్ పొదుపు వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ కీర్తి చేకూరి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, విద్యుత్‌ను ప్రకృతి వనరుగా కాక అమూల్యమైన సంపదగా భావించినప్పుడే ఇంధన పొదుపు లక్ష్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అవసరం ఉన్న చోట మాత్రమే విద్యుత్ వినియోగించాలని, దుర్వినియోగాన్ని నివారించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. విద్యుత్ పొదుపు వల్ల వినియోగదారుల బిల్లులు తగ్గడమే కాక రాష్ట్రంపై అదనపు ఆర్థిక భారం తగ్గుతుందని, పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదం చేస్తుందని తెలిపారు. విద్యుత్ అవసరం ఉన్నప్పుడు మాత్రమే వినియోగించాలని, అవసరం లేని సమయంలో వినియోగాన్ని నియంత్రించాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. డిసెంబర్ 14 నుంచి 20 వరకూ జాతీయ ఇంధన వారోత్సవాలు నిర్వహిస్తున్న క్రమంలో భాగంగా ఈ రోజు అవగాహన ర్యాలీ నిర్వహించినట్టు తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి దేవీచౌక్ వరకూ ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో ఇంధన సంరక్షణ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అధికారులు, విద్యార్థులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లా ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీలో విద్యుత్ శాఖ ఎస్ఇ టి.తిలక్ కుమార్ మాట్లాడుతూ, విద్యుత్ పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో చైతన్యం పెంచేందుకు పాఠశాలల్లో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా వారోత్సవ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇఇలు ఎన్.శ్యాముల్, జిపిబి.నటరాజన్, ఎన్.నారాయణ అప్పారావు, రవి కుమార్, అధికారులు పి.స్టీఫెన్, కె.ఆదినారాయణ మూర్తి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి



సిల్ట్ తొలగిస్తున్న సిబ్బంది

ఎంప్లాయిస్ కాలనీలో మురుగు తొలగింపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలోని గ్రామ పంచాయతీ పరిధిలోని ఎంప్లాయిస్ కాలనీ వద్ద ఉన్న మురుగు కాలువను పంచాయతీ అధికారులు మంగళవారం శుభ్రపరిచే పనులు చేపట్టారు. కాలువలో పేరుకుపోయిన మురుగును తొలగించి నీటి ప్రవాహం సజావుగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి తలారి మూర్తి దృష్టికి మురుగు కాలువ సమస్యను కాలనీ వాసులు తీసుకు వెళ్లారు. సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. వెంటనే పంచాయతీ కార్యదర్శితో మాట్లాడారు. సమస్యను వివరించడంతో పంచాయితీ కార్యదర్శి వెంకటరావు ఆదేశాలతో సిబ్బంది జెసిబి సాయంతో కాలువలోని వ్యర్థాలను, ప్లాస్టిక్, ఇతరత్ర చెత్తను ట్రాక్టర్‌లో డంపింగ్ యార్డ్‌కు తరలించారు. మురుగునీరు శుభ్రం చేయడం ద్వారా పరిసర ప్రాంతాల్లో దుర్వాసన, దోమల సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని పంచాయతీ ఇఒ తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి శుభ్రత కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించడంతో కాలనీ వాసులు తలారి మూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

సెయింట్ జోసఫ్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలోని యర్నగూడెంలో సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను గ్రామ సర్పంచ్ బొంతా భరత్ బాబు మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత వెలికి తీసేందుకు వారితో నూతన ఆవిష్కరణలు సృష్టించేందుకు, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని అన్నారు. స్కూల్ విద్యార్థుల ఆవిష్కరణలను భరత్ ఆసక్తిగా తిలకించి విద్యార్థులను అభినందించారు ఉత్తమ స్థానంలో నిలిచిన ముగ్గురు విజేతలకు,. పది మందికి కన్సలేషన్ అవార్డులను రూ.11 వేలను భరత్ అందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రెవరెండ్ సజి థామస్, ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ ఎల్సీ, జెడ్‌పి హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయులు సురేష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ఉద్యోగులకు అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఓఎన్‌జిసి ఉద్యోగులకు మంగళవారం సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో సైబర్ పోలీసులు మాట్లాడుతూ... సైబర్ నేరాల పట్ల పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తక్కువ ఇన్వెస్ట్‌మెంట్‌తో ఎక్కువ డబ్బులు వస్తాయని, సులువుగా డబ్బులు సంపాదించాలని అత్యాశకు పోయి, సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని డబ్బులు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో అపరిచితులతో చాటింగ్ చేయవద్దని, ఇతర యాప్‌లు, లింకులు, ఈ మెయిల్స్‌తో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అనవసర లింక్‌లను, అప్లికేషన్లను క్లిక్ చేయడంతో కలిగే అనర్థాల గురించి వివరించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలని www.cybercrime.gov.in వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగంపేట గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సామర్లకోట కు చెందిన డి.వండు, డి.అక్షయ్‌కుమార్ మోటార్ బైక్ పై ప్రత్తిపాడు వెళుతుండగా జి.రాగంపేట వద్ద బైకు అదుపుతప్పింది. దీంతో ఆ యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారికి పెద్దాపురం ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మౌనిక తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం యానాం నుంచి అమలాపురం ఊకలోడుతో ట్రాక్టర్ వెళుతోంది. ఈ సమయంలో నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బొండాయికోడు తూము సెంటర్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్ స్కూటీపై వెళ్తున్న మహిళను తప్పించబోయాడు. దీంతో ట్రాక్టర్ పంట కాలువలోకి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఉప్పలగుప్తం మండలం కూనవరం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వరసాల సత్య నారాయణ (58) మృతి చెందారు. స్కూటీపై వెళు న్న మహిళకు గాయాలయ్యాయి. మృతునికి భార్య నారాయ ణమ్మ, ఒక కుమార్తె, మగ్గురు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్ఐ జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మరణం

ప్రజాశక్తి - వాగల్లు

పనివేదల రైల్వే స్టేషన్ ట్రాక్ మధ్యలో గుర్తుతెలియని 40 ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ పి.అప్పారావు తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9490617090, 7013360296 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

405.7 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - గోకవరం

405.7 కేజీల గంజాయిని గోకవరం పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కామరాజుపేట శివారులో రోడ్డు పక్కన అనుమానాస్పదంగా ఉన్న వ్యాన్‌పై గోకవరం ఎస్.ఐ పవన్ కుమార్‌కు సమాచారం వచ్చింది. ఎస్ఐ సిబ్బందితో వెళ్లి వ్యాన్ను తనిఖీ చేయగా అందులో మొత్తం 22 బస్తాల్లో 405.7 కేజీల గంజాయి గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - కడియం

మండలంలోని పొట్టిలంక 216 జాతీయ రహదారిపై మంగళవారం రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. కడియపులంక నుంచి వస్తున్న లారీ పొట్టిలంక జాతీయ రహదారిపై ఎర్నాకులం డివైడర్ నుంచి వేమగిరి వైపు వెళ్లేందుకు యూటర్న్ తిరుగుతుండగా బైకుపై వస్తున్న కడియపులంకకు చెందిన కర్రి సూరిబాబు (35) లారీని వెనుక భాగంలో బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి -దేవరపల్లి

సంసద్ ఖేల్ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ ఆధ్వర్యంలో దేవరపల్లి మండల స్థాయి క్రీడా పోటీలను బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ నాగార్జున తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు 19, 20న జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని, అన్ని పోటీలూ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని వారు పేర్కొన్నారు. క్రీడాకారులు సమయానికి హాజరై పోటీల్లో పాల్గొనాలని అధికారులు సూచించారు. ఎంఇఒ, క్రీడాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారని తెలిపారు.



నూతన కార్యవర్గానికి అభినందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ జిల్లా కమిటీకి అభినందన

ప్రజాశక్తి - అంబాజీపేట

రాయవరం మండలం పసలపూడిలో జరిగిన యుటిఎఫ్ జిల్లా కమిటీ ఎన్నికలలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులుగా పింకే వెంకటేశ్వరరావు, నూతన అధ్యక్షునిగా జి.వి.రమణ, ప్రధాన కార్యదర్శిగా ఎమ్‌టివి.సుబ్బారావు, జిల్లా ఎఫ్‌డబ్ల్యూఎఫ్ డైరెక్టర్ గా పి.నారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి సభ్యులుగా జి.రాంబాబు ఎన్నికయ్యారు. వీరికి మంగళవారం యుటిఎఫ్ అంబాజీపేట మండల శాఖ పక్షాన ఉదయం అభినందనలు తెలిపారు.

ఎపిటిఎఫ్ మండల అధ్యక్షునిగా రవికుమార్

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఎపి టిఎఫ్ (1938) మండల అధ్యక్షునిగా గుత్తుల రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా నెల్లి వెంకట్రావు నియమి తులయ్యారు. వీరిని జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎన్. మునేశ్వరరావు నియమించారు. నియామక పత్రాలను బుధవారం ఎంఇఒ సత్యన్నారాయణ, మునేశ్వరరావు అందజేశారు.



అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి సుభాష్

ప్రజాదర్బార్‌కు 950 అర్జీలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలో మంగళవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నిర్వహించిన ప్రజా దర్బార్ కు విశేష స్పందన లభించింది. నియోజకవర్గం లోని కే గంగవరం మండలం కాజులూరు మండలం లోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో మంత్రి కార్యాలయం కిటకిటలాడింది. ప్రజా దర్బార్ కు మొత్తం 950 అర్జీలు అందాయి. మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఎఎంసి చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, దూడల శంకర్ నారాయణ, కె. గంగవరం, కాజులూరు మండలాల టిడిపి అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, చవ్వాకుల నారాయణమూర్తి, స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ నలామి రమేష్,పాల్గొన్నారు.

పలువురికి మంత్రి ఆర్థిక సాయం

పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం పలువురికి ఆర్థికంగా సహాయం అందించారు. చోడవరంకు చెందిన అయినవిల్లి సత్యవతి మానసిక వ్యాధితో బాధపడుతుండగా మంత్రి సుభాష్ ఆమెకు రూ.10 వేల చెక్కు అందజేశారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న అముజూరు గ్రామానికి చెందిన శాకా చినబంగారాజుకు రూ. 3 వేలు సాయం, నిత్యవసర వస్తువులు అందించారు. రామచంద్రపురానికి చెందిన నడిపల్లి సత్యనారాయణ ఊపిరితిత్తుల సమస్యతో బాధపడ తుండగా అతని ఆరోగ్య సమస్య తెలుసుకొని నెలకు సరిపడా అవసరమైన మందులను కొని అందించారు.

శిరోముండనం బాధితులకు కుల ధృవీకరణ పత్రాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాష్ట్రంలో సంచలనం కలిగించిన వెంకటాయపాలెం శిరోముండనం బాధితులకు కుల ధృవీకరణ పత్రాలను మంత్రి వాసంశెట్టి సుభాష్ అందజేశారు. శిరోముండనం సంఘటన జరిగి సుమారు 30 ఏళ్లు కావస్తుంది. ఈ కేసులో బాధితులకు అప్పటినుండి కుల ధృవీకరణపత్రాలు అందకుండా పలు ఆటంకాలు స ృష్టించడంతో బాధితులు పిల్లలను చదివించుకునేందుకు కుల ధృవీకరణ పత్రాలు లేక పలు ఇక్కట్లకు గురయ్యారు. దీంతో బాధితులు రాష్ట్ర మంత్రి సుభాష్ ను కలిసి కుల ధృవీకరణ పత్రాలు ఇప్పించాలని విన్నవించారు. దీంతో మంత్రి అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో దళిత శిరోముండనం బాధితులకు కుల ధృవీకరణ పత్రాలు అందజేశారు. ధృవీకరణ పత్రాలు అందుకున్న బాధితులు చల్లపూడి పట్టాభి రామయ్య, కోటి చినరాజు, దడాల వెంకటరమణ లు మంత్రి సుభాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

ఫోన్ యాప్‌ల ద్వారా జరిగే ఆన్లైన్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని నగరం ఎస్ఐ చైతన్య కుమార్ అన్నారు. ఫోన్ ప్యాక్ కాల్ ఎల్ల జరిగే ఆన్లైన్ మోసాలపై ఆయన అవగాహన కల్పించారు. నగరం సాయి దీప్తి జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులతో ఎస్ఐ మంగళవారం పలు అంశాలపై మాట్లాడారు. ఫోటో మార్ఫింగ్, వీడియో కాల్ గురించి వివరిస్తూ వాటి వల్ల మోసపోవద్దన్నారు. మైనర్ విద్యార్థులు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మోటార్ సైకిల్ నడిపితే జరిగే అనర్థాల ను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జె.శివప్రసాద్, అకడమిక్ ప్రిన్సిపల్ కె.సత్య వరప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస సాయిబాబా, గ్రేడ్ వన్ కార్యదర్శి సత్తిబాబులను సన్మానిస్తున్న ఎంపిడిఒ తదితరులు

పలువురికి ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం.

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న బి. సాయిబాబాకు ఎఒగా ఉద్యోగోన్నతి లభించింది. ఈయన ఐ. పోలవరం మండలానికి ఎఒ గా బదిలీ అయ్యారు. అలాగే వల్లూరు పంచాయతీ గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శిగా పనిచేయచున్న కె.సత్తిబాబు గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగోన్నతి పొంది రామచంద్రపురం మండలం తాళ్లపొలం పంచాయతీ కార్యదర్శిగా గాను, కలిదిండి పంచాయతీ కార్యదర్శి ఐదే మండలంలో గ్రేడ్-2 గా పనిచేస్తున్న యు. సుప్రియ గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగోన్నతి పొంది ఐదే మండలంలో టేకి పంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఉద్యోగోన్నతి పొందిన వారిని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ. హెచ్.భానుజీ రావు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఒ జి.రాజేంద్రప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఒ బి.వరప్రసాద్, సచివాలయ డిప్యూటీ ఎంపిడిఒ వి.రామమూర్తి, కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులుపాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివిజనల్ ఇన్‌ఛార్జి

ప్రకృతి సాగుపై అవగాహన

ప్రజాశక్తి - రావులపాలెం

డ్వాక్రా మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అధికారులు అవగాహన కల్పించారు. రావులపాలెంలో రైతు సాధికారత సంస్థ కన్వర్జెన్స్ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో డివిజన్ ఇన్‌ఛార్జి ఎల్.ప్రసాద్, ఎపిఎం విజయ్ పాల్గొన్నారు. ప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఎంఎన్ఎఫ్ (నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్) గ్రామాలలో చేయవలసిన కార్యక్రమాలు గురించి వివరించారు.అలాగే బీజామృతం వలన ఉపయోగాలు వివరించారు. విత్తన శుద్ధి విధానాన్ని చూపించారు. అనంతరం డ్వాక్రా ఎపిఎం విజయ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ భూమి ఆరోగ్యం, మన ఆరోగ్యం కాపాడుకునే ఆవశ్యకత ఉందని తెలిపారు. అలాగే ప్రతీ ఒక్కరు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకుని వెళ్ళాలి అంటే ప్రతీ డ్వాక్రా సభ్యురాలితో మాత్రమే ఇది సాధ్యమన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య సభ్యులు, ప్రతినిధులు , ప్రెసిడెంట్ ఎమ్.దేవి పార్వతి, సెక్రటరీ బి.అన్నపూర్ణ, సిసిలు, విఒఎ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఐసిఆర్పిలు, యూనిట్ ఇన్‌ఛార్జి శాంతి కుమారి, ప్రసాద్, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

బోస్‌పై విమర్శలు తగవు

ప్రజాశక్తి - రామచంద్రపురం

సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను, ఆయన కుమారుడు సూర్యప్రకాష్‌పై విమర్శలు తగవని వైసిపి నాయకులు అన్నారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కొయ్య బంగారు బాబు, పార్టీ ప్రచార కార్యదర్శి రేవు నాగేశ్వరరావు మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బోస్‌ను, సూర్యప్రకాష్‌ను కాటే సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి స్థాయి మరిచి విమర్శించడం మంచి పద్ధతి కాదన్నారు. అసలు అతను ఏ పార్టీలో కొనసాగుతున్నాడు స్పష్టం చేయాలన్నారు. లేకుంటే దళితుల ఆగ్రహాన్ని చవి చూడవలసి వస్తుందన్నారు. సుబ్రహ్మణ్యం విమర్శలను వారు ఖండించారు. సమావేశంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు గుబ్బల శ్రీను, మున్సిపల్ కౌన్సిలర్ పోతంశెట్టి గోపాలకృష్ణ, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు యనమదల శ్రీను, కాజులూరు మండలం యువజన విభాగం ఉపాధ్యక్షులు నిమ్మది విజయ్, కందులపాలెం గ్రామ సర్పంచ్ పెంకె వీర రాఘవులు, దంగేరు-2 గ్రామ కమిటీ అధ్యక్షులు దారా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - అయినవిల్లి

ఇటీవల జరిగినకరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో అయినవిల్లి మండలం ముక్తేశ్వరం రారాజు జిమ్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారు వారిలో జె.ధనుష్, కె.చరణ్‌కుమార్, ఎల్.సోమనాధ్ బంగారుపతకాలు, బి.దేవగణేష్ కాంస్య పతకం సాధించారు విజేతలకు జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు కుడుపూడి విద్య సాగర్, నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, సిరిపల్లి ఎంపిటిసి సభ్యుడు యడ్ల కిరణ్‌బాబు, బొంతు శ్రీనివాస్ కరాటేలో విజయం సాధించిన మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కరాటే విద్య ఆత్మరక్షణకు, ఆరోగ్యానికి మంచిదన్నారు. ప్రతి ఒక్కరూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిమ్, కరాటే మాస్టర్ రారాజు ను అభినందించారు.

బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించాలి

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా పరిధిలోని అన్ని విద్యాసంస్థలలో చదువుతున్న 5 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్థుల ఆధార్ కార్డులకు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేషన్ చేయించుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటన ద్వారా పిలుపు నిచ్చారు. ఆధార్ జారీ సంస్థ నిబంధనల ప్రకారం పిల్లలకు 5 సంవత్సరాలు, 17 సంవత్సరాల వయస్సులో రెండు సార్లు బయోమెట్రిక్ అప్డేట్ ఫోటో, వేలిముద్రలు, ఐరిస్ చేయడం తప్పనిసరని అన్నారు. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇటీవల ప్రకటించిన మార్గాల ప్రకారం 5 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్‌పై నిర్దేశించిన ఛార్జీలు ఒక సంవత్సరం పాటు మినహాయించబడ్డాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని దగ్గరలోని ఆధార్ నమోదు, అప్డేట్ కేంద్రాలను ఈనెల 16 నుంచి 20 వరకు మొదటి దఫాగా రెండో దఫాగా ఈనెల 22 నుంచి 24 వరకు ఆధార్ పాఠశాలల్లో క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 8 రోజులలో జిల్లా వ్యాప్తంగా గణాంకాలు సూచిస్తున్న 27, 472 మందికి ఆధార్ అప్డేషన్ సుమారు 90 కిట్లతో నమోదు చేస్తారన్నారు.

అంతర్వేదిలో పూజలు

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

అంతర్వేది శ్రీలక్ష్మీ నారసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం ఘనంగా నిర్వహించారు..

పైడిమెట్ట పాఠశాలలో విజయ దివస్

ప్రజాశక్తి-తాళ్లపూడి

ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచీ దేశభక్తితో మెలుగుతూ అవసర సమయంలో దేశం కోసం ఉద్యమం చేయడానికి ముందడుగు వేయాలని పైడిమెట్ట ఎంపిపిపి పాఠశాల హెచ్ఎం దున్నా దుర్గారావు అన్నారు. డిసెంబర్ 16న విజయ దివస్‌ను పురస్కరించుకుని పాఠశాల వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయ పతాకాన్ని చేతబూని ప్రదర్శన చేశారు. దుర్గారావు మాట్లాడుతూ 1971లో పాకిస్తాన్‌పై భారత సైన్యం సాధించిన విజయాన్ని పురస్కరించుకుని విజయ దివస్‌ను ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు.

సంసద్ ఖేల్ క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరంలో పువ్వాడ సత్యనారాయణ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంసద్ ఖేల్ క్రీడా పోటీలను రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ మంగళవారం ప్రారంభించారు. అనంతరం పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులను ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ సంసద్ ఖేల్ పోటీలు నిర్వహిస్తోందని తెలిపారు. మానసిక ఒత్తిడిని జయించడానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీల ద్వారా విద్యార్థులకు స్ఫూర్తి, ఆరోగ్యం, సమిష్టి నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, ఎంపిడిఒ భారతి, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంఇఒ స్వామి నాయక్, ఇతర అధికారులు, జనసేన, టిడిపి, బిజెపిలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ గుత్తుల మురళీధర్ మృతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ మాజీ కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, వైసిపి నాయకుడు గుత్తుల మురళీధర్‌రావు (56) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి వైసిపి నాయకులు జక్కంపూడి రాజా, చెల్లుబోయిన వేణు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

పల్స్ పోలియోపై శిక్షణ

ప్రజాశక్తి-పెరవలి

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం పెరవలి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ రాజానాల ప్రసాద్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఉన్న ఆరోగ్య సిబ్బందికి పల్స్ పోలియోపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజానాల ప్రసాద్ మాట్లాడుతూ 21న పల్స్ పోలియో చుక్కలు 0 నుంచి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ రెండు వేస్తారని తెలిపారు. పిహెచ్‌సి పరిధిలో 5,320 మంది పిల్లలు ఉన్నారని, వైద్యాధికారి డాక్టర్ రాజానాల ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఉమా రాజ్యలక్ష్మి పద్మజ, ఎంఇఒ షేక్ సూర్జాన్, సిడిపిఒ ఎం.ఆశా రోహిణి పాల్గొన్నారు.

మంత్రి పవన్ కల్యాణ్ పర్యటనకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-పెరవలి

పెరవలి మండల కేంద్రంలో 20న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటనా ఏర్పాట్లను మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం పరిశీలించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్డిఒ సుస్మిత, తహశీల్దార్ కె.నిరంజన్, ఎంపిడిఒ పద్మజ, జనసేన నాయకులు పిప్పర రవికుమార్, కోటిపల్లి మురళీకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు నందిప శ్రీనివాస్ చక్రవర్తి, జిల్లా నాయకులు తులా చినబాబు, రాంబాబు, సంగీత నాగు పాల్గొన్నారు.



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న వంశ పారంపర్య ధర్మకర్త చక్రి

బాల బాలాజీ దేవస్థానం అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం లో నిర్వహించే అన్నదాన ట్రస్ట్ కు యలమంచిలి మండలం వైవి.లంకకు చెందిన చేకూరి నాగరాజు, గంగాదేవి దంపతులు, వారి కుటుంబ సభ్యులు మంగళవారం ట్రస్ట్ కు రూ.10,500 విరాళంగా సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. దాతకు దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త మొల్లేటి లక్ష్మీనారాయణ(చక్రి) స్వామివారి చిత్రపటం అందజేశారు. ఈనెల 30న ఉత్తర ద్వార దర్శనం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో శయన మండపంలో ఉభయ దేవేరులతోపాటు స్వామి వారి దర్శనం నిమిత్తం ఏర్పాట్లుచేశామని ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు. యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.